క్లుప్తంగా

కిశోర వికాసంపై అవగాహన పెంచండి : జేసీ

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలోని మండల స్థాయిలో కిశోర వికాసంపై అవగాహన పెంచేందుకు చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ విద్యాధరి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో టీనేజ్ ప్రెగ్నెన్సీ (చిన్నవయస్సులో గర్భధారణ) అంశంపై సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని బాల్యవివాహాల నియంత్రణకు, టీనేజ్ ప్రెగ్నెన్సీ నివారణపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. చిన్నవయసులో గర్భధారణ వల్ల కలిగే అనర్థాలను ఆడపిల్లల తల్లిదండ్రులకు తెలియజేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తల సమన్వయంతో పనిచేసి విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అవగాహన పెంచడం వల్ల జిల్లాలో బాల్య వివాహాలు తగ్గుతాయన్నారు. టీనేజ్ ప్రెగ్నెన్సీతో మాతా శిశు మరణాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్న విషయాలను తెలియజేయాలన్నారు. జిల్లాలో 2,057 మంది టీనేజ్ ప్రెగ్నెన్సీలు జరిగినట్లు తెలిపారు. ఎక్కువగా కుప్పం, పలమనేరులో ఉన్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి, ఐసీడీఎస్ పీడీ హైమావతి, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో రూరల్ కార్యాలయ పనులు పరిశీలన

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక పాత కలెక్టరేట్‌లోని ట్రాన్స్‌కో రూరల్ కార్యాలయంలో చేస్తున్న మరమ్మతులను శుక్రవారం ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ పరిశీలించారు. కార్యాలయాన్ని రూ.7 లక్షలతో పునరుద్ధరణ పనులు చేస్తున్నారు. పెయింటింగ్, గదుల విభజన పనులను పూర్తి చేసినట్లు ఈఈ సురేష్ తెలిపారు. ఇక ఇంటర్‌నెట్ సౌకర్యం, ఇతర చిన్న పనులను పూర్తి చేయనున్నట్లు చెప్పారు. త్వరలో కార్యాలయాన్ని వినియోగంలోకి తీసుకువస్తామని ఎస్ఈ తెలిపారు.కార్యక్రమంలో ఈఈ జగదీష్, ఏఈ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు



చిత్తూరు రూరల్ (కాణిపాకం): డాన్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలను చిత్తూరు నగరం జైనగర్ కాలనీలోని బైబిల్ ఫెలోషిప్ చర్చిలో శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. వంద మంది పాస్టర్లకు దుస్తులు, నిత్యావసరాలను వితరణ చేశారు. ఏసుక్రీస్తును ఆరాధిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. డాన్ మినిస్ట్రీస్ సభ్యులు పీటర్‌తో పాటు పాస్టర్ పాలీరాజ్, రెవరెండ్ రాబర్ట్, జాషువా, విశ్రాంత ఎంపీడీవో విలియమ్, మోహన్, జ్ఞానప్రకాశం పాల్గొన్నారు.

వరి కోత యంత్రాలు.. రైతన్నలకు నేస్తాలు

గతంలో వ్యవసాయ పనులకు రైతులు ఇబ్బందులు పడేవారు. ఆధునిక కాలంలో ఎన్నో యంత్రాలు అందుబాటులోకి రావడంతో వ్యవసాయ పనులు చేయడం సులభతరమయ్యాయి. ఖర్చు, సమయం ఆదా అవుతుండడంతో రైతన్నలు వాటి వైపు మొగ్గు చూపుతున్నారు.

- యంత్రాలతో ఖర్చు, సమయం ఆదా
- మొగ్గు చూపుతున్న రైతులు



కోత దశలో ఉన్న వరి పంట



వరి పంటను కోత కోస్తున్న చెయిన్ మెషిన్

ఐరాల: వరి కోత యంత్రాలు రైతులకు నేస్తాలుగా మారాయి. ఈ యంత్రాల రాకతో పంటలు కోయడం సులువుగా మారింది. ఒక ఎకరా వరి పంటను కూలీలతో కోయాలంటే ఐదు రోజుల సమయం పడుతుంది. అలాగే సుమారు 30 మంది కూలీలు సైతం అవసరమే. అంతేకాదు వారం పాటు శ్రమిస్తేనే ధాన్యం ఇంటికి చేరేది. అయితే వరి కోత యంత్రాలు రావడంతో గంటలో ఒక ఎకరా పొలాన్ని కోత కోసి ఇంటికి ధాన్యాన్ని తరలిస్తుండటం చూస్తే యాంత్రీకరణ ఎంత మేలు చేస్తోందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

మండలంలో 127 హెక్టార్లలో వరి పంటను సాగు చేశారు. సుమారు 120 హెక్టార్లలో కోతలు పూర్తి చేశారు. మిగిలిన 7 హెక్టార్లలో రైతులు యంత్రాలతో కోతలకు సన్నద్ధమవుతున్నారు. ఎకరా వరి పంట కోసేందుకు హార్వెస్టర్ యజమానులు రూ.2,700 నుంచి రూ.3000 వరకు తీసుకుంటున్నారు. చెయిన్ మెషిన్‌కు మాత్రం రూ.3,400 నుంచి రూ.4000 వరకు చార్జి ఒక ఎకరా వరి పంటను వరి కోత యంత్రాలు రెండు గంటల్లోపు కోస్తున్నాయి. అయితే గతంలో ఒక ఎకరా వరి పంటను కోయాలంటే 10 మంది కూలీలు, మరో పది మంది కూలీలు మోపులు కొట్టాలి. మరో పది మంది కూడా కోతకు అవసరం. ఇలా సుమారు 30 మంది కూలీలు శ్రమించాల్సి వచ్చేది. రోజుకు మహిళా కూలీలకు రూ.500, పురుషులకు రూ.800 ఇవ్వాల్సి వచ్చేది. కోతల సమయంలో కూలీల కొరత, అధిక ఖర్చు, సమయం వృథా అవుతుండడంతో రైతులంతా హార్వెస్టర్ యంత్రాలవైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో ఖర్చుతో పాటు సమయం ఆదా అవడమే కాకుండా ధాన్యాన్ని నేరుగా మార్కెట్‌లకు తరలించేందుకు అవకాశం సైతం ఉంటోంది. అయితే ఈ యంత్రాలు వినియోగించే సమయంలో రైతులు, యజమానులు ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా నష్టపోవాల్సి వస్తుందని, అందుకే యంత్రాలతో వరి కోతల సమయంలో పలు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

వ్యవసాయాధికారులు చెబుతున్న జాగ్రత్తలు

ఒక మడి నుంచి మరో మడికి వెళ్లేందుకు ముందుగా మంచి బాట తీస్తే హార్వెస్టర్ యంత్రం సులువుగా వెళ్తుంది. దీంతో వడ్లు పాడయ్యే అవకాశం ఉండదు. పూర్తిగా భూమి ఎండిన తర్వాత వరి కోస్తే సమయం ఆదా అవుతుంది. ఒడ్డు, గట్టు చుట్టూ ఉన్న వరి పంటను చేతితో కోయటం వల్ల ఎకరాకు దాదాపు పదినిషాల సమయం కలిసి వస్తుంది. పచ్చిగా ఉన్న వరి కోయడం వల్ల సమయం ఎక్కువగా పడుతుంది. అలాగే వడ్లు కూడా మట్టిలో కలిసిపోయే అవకాశం ఉంటుంది. పొలంలో రాళ్లు ఉండే చోటును ముందుగానే గుర్తిస్తే కోత సమయంలో మెషిన్ బ్లేడ్ విరిగి నష్టం వాటిల్లకుండా ఉంటుంది. విద్యుత్ స్తంభాలకు చాలా దూరం నుంచే హార్వెస్టర్‌ను వెళ్లనివ్వాలి. వరి పంట నేలకు ఆనుకున్న సమయంలో హార్వెస్టర్‌తో కాకుండా కూలీల చేత కోత కోయించాలి. వడ్లు నిల్వ ఉంచుకునే రైతులు హార్వెస్టర్‌తో పంటను కోసిన వెంటనే తేమ లేని ప్రదేశంలో వడ్లు ఆరబోసి పూర్తిగా బట్టిబడిన తర్వాత నిల్వ చేసుకోవాలి. వాతావరణంలో మార్పులు ఉన్న సమయంలో కోతలు కోయకుండా ఉండటమే మంచిది. నేల, వరి గింజల్లో తేమ లేదని భావిస్తే మాత్రమే మెషిన్‌తో కోత కోయించాలి. తేమ ఉన్న సమయంలో గానీ, వర్షం వచ్చే సూచనలు ఉన్నప్పుడు కోతలు కోస్తే గింజల్లో తేమశాతం ఉండి, వరి గింజలు బూజుపట్టి పాడైపోతాయి.

ఆర్థిక భారం తగ్గించేందుకే



ఎకరా వరి పంటను కూలీలతో కోయాలంటే సుమారు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు ఖర్చవుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో యంత్రాలతో కోస్తే ఆర్థిక భారం తగ్గుతుంది. సరైన సమయంలో వడ్లు గింజలు ఇంటికి చేరుతాయి. దీంతో పాటు సమయం, ఖర్చు ఆదా అవుతుంది. వరి కోత యంత్రాలు రావడంతో కోతలు చాలా సులువుతుంది. ఒక ఎకరా వరి పంటను గంటలో కోసి వరి ధాన్యాన్ని ఇంటికి చేర్చుకుంటున్నాం.

–శ్రీనివాసులురెడ్డి, సీవీ.పల్లె, ఐరాల

పంట దిగుబడిని కాపాడుకోవాలి

యంత్రాలతో వరి కోత సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. వరి పంట కోసిన తర్వాత తేమ తగ్గేందుకు అనువైన ప్రదేశంలో ధాన్యం ఆరబెట్టాలి. అయితే ధాన్యంలో తేమ ఒక్కసారిగా తగ్గకుండా క్రమక్రమంగా తగ్గాలి. ఇందుకోసం రైతులు సాధారణ ఎండలోనే ధాన్యం ఆరబెట్టాలి. పంట దిగుబడిని కాపాడుకోవాలి.

–వరలక్ష్మి, ఏఓ, ఐరాల

స్తంభించిన రిజిస్ట్రేషన్లు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో రెవెన్యూ సదస్సుల శుక్రవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి రిజిస్ట్రేషన్ సిబ్బంది కూడా హాజరు కావాలని ఆదేశాలు జారీచేశారు. దీంతో జిల్లాలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి కూడా సిబ్బంది వెళ్లారు. ఆ ప్రభావం రిజిస్ట్రేషన్ల పడటంతో మధ్యాహ్నం వరకు రిజిస్ట్రేషన్లు దాదాపు ఆగింది. వివిధ లావాదేవీల నిమిత్తం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చినవారు వేచిచూసి నిరాశతో తిరిగి వెళ్లారు. మధ్యాహ్నం తర్వాత రిజిస్ట్రేషన్లు కొనసాగాయి.

నేడు ఉపాధ్యాయుల, తల్లిదండ్రుల సమావేశం

తవణంపల్లె: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం (పీటీఎం) నిర్వహిస్తామని తవణంపల్లె ఎంఈఓలు హేమలత, త్యాగరాజురెడ్డి తెలిపారు. తవణంపల్లె హైస్కూల్‌లో నిర్వహించే ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరి పాల్గొంటారన్నారు.

సేవా దృక్పథంలో ముందుకు..

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థులు విద్యకు ప్రాధాన్యత నిస్తూనే చిన్నతనం నుంచి సేవా దృక్పథంతో ముందుకెళ్లాలని శ్రీ సత్యసాయి సేవా సంస్థ జిల్లా అధ్యక్షులు మధుసూదనం అన్నారు. శుక్రవారం నగరంలోని పీసీఆర్ ప్రభుత్వ పాఠశాలలో ఆ సంస్థ ఆధ్వర్యంలో సత్యసాయి శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడారు. విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీ సత్యసాయి సేవా సంస్థ సభ్యులు మనోహర్, గణేష్, తరుణలక్ష్మి, హెచ్ఎం పూర్ణాణి, డాక్టర్లు జ్యోతిరెడ్డి, సుహానా తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం రేపు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో ఆదివారం అరవింద కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఈఓ పెంచల కిషోర్ తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సదస్సు జరుగుతుందన్నారు. భక్తులు, ఆలయ సిబ్బంది, గ్రామస్తులు, సదస్సును సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ప్రయోజనాలు



రైతులకు కషాయాల తయారీపై అవగాహన కల్పిస్తున్న సుమతి

ఐరాల: పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులకు బహుళ ప్రయోజనాలు ఉన్నాయని ప్రకృతి వ్యవసాయ వనరుల సేవా కేంద్రం యజమాని సుమతి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఈ.మిట్టూరులో వ్యవసాయాధికారి వరలక్ష్మి ఆధ్వర్యంలో రైతులకు కషాయాల తయారీపై అవగాహన కల్పించారు. ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, తదితర కషాయాల తయారీ, వాడకం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు రసాయన ఎరువులు, పురుగు మందులపై ఆధార పడకుండా ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగు చేయాలని కోరారు. ప్రకృతి వ్యవసాయం మానవాళికి ఆరోగ్యకరమని తెలియజేశారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఏ కవిత, ఎన్‌పీఎమ్ ఎంటీ సుధాకర్‌నాయుడు, ఎన్ఎఫ్ మాస్టర్ ట్రైనర్ హనుమంతు, ఏఈఓ ద్రాక్షాయని, వీఏఏ లక్ష్మీ పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్ట్

చిత్తూరు అర్బన్: కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు చిత్తూరు అర్బన్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ శ్రీహరిరెడ్డి తెలిపారు. చిత్తూరులోని ఇరువారం క్రాస్ వద్ద శుక్రవారం అక్రమ కర్ణాటక మద్యం విక్రయాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో యాదమరి మండలం బుడితిరెడ్డిపల్లెకు చెందిన కృష్ణమూర్తి రెడ్డి (51) అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తూ పట్టుపడ్డాడు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ మోహన్‌కృష్ణ, సిబ్బంది శరవణ, దామోదర, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతాంగం సమస్యల పరిష్కారానికే సదస్సులు



సదస్సులో తహసీల్దార్‌కు అర్జీ ఇస్తున్న రైతు

గుడిపాల: రైతాంగం సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నారగల్లులో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, రైతులకు సంబంధించి భూముల సమస్యలు ఉన్నట్లయితే అర్జీల రూపంలో తమ దృష్టికి తెస్తే 45 రోజుల్లోపు పరిష్కరిస్తామన్నారు. నారగల్లు రెవెన్యూలో మ్యుటేషన్‌కు సంబంధించి ఏడుగురు, దారి సమస్యపై ఇద్దరు అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ లక్ష్మి, సర్వేయర్ గోపి, ఆర్ఐ రమాసాయి, వీఆర్ఓ రాజారాం తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు ప్రారంభం





రోడ్డు సమస్యను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్, అధికారులతో మాట్లాడుతున్న జేసీ విద్యాధరి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగర, మండల ప్రాంతాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు ప్రారంభమయ్యాయి. నగరంలోని ఎల్‌బీపురంలో రెవెన్యూ సదస్సును నిర్వహించగా ట్రైనీ కలెక్టర్ హిమవంశీ సదస్సుకు హాజరై అర్జీలను స్వీకరించారు. మొత్తం 28 అర్జీలు రాగా అందులో దారి తగదాలకు సంబంధించి అధికంగా ఉన్నాయని తహసీల్దార్ కళావతి తెలిపారు. అలాగే చిత్తూరు మండలంలోని తేనెబండ రెవెన్యూలో సదస్సు నిర్వహించారు. లోకేశ్వరి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 43 అర్జీలు రాగా అందులో భూ తగాదాలు, డీకేటీ భూములకు పట్టాలు ఇవ్వాలని కోరారు.

రెవెన్యూ సదస్సులు సజావుగా నిర్వహించాలి : జేసీ

కాణిపాకం: రెవెన్యూ సదస్సులు సజావుగా జరిగేలా చూడాలని జేసీ విద్యాధరి ఆదేశించారు. యాదమరి మండలం కుక్కలపల్లి గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. జేసీ హాజరై కార్యక్రమ నిర్వహణను అడిగి తెలుసుకున్నారు. వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వద్దన్నారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. 30కి పైగా అర్జీలు రాగా వాటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పార్థసారథి తెలిపారు. అలాగే పూతలపట్టు మండలంలోని ఎర్రచెరువుపల్లిలో మొత్తం 51 అర్జీలు వచ్చాయని అధికారులు చెప్పారు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు



బంగారుపాళెం: మహాసముద్రంలో అర్జీదారులతో మాట్లాడుతున్న తహశీల్దార్

బంగారుపాళెం: భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ బాబురాజేంద్ర ప్రసాద్ అన్నారు. మహాసముద్రం సచివాలయం ఆవరణలో శుక్రవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి మొత్తం 66 అర్జీలు వచ్చాయన్నారు. శనివారం మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ కారణంగా కల్లూరుపల్లెలో నిర్వహించాల్సిన గ్రామ సభ జనవరి 7న నిర్వహించనున్నట్లు తెలిపారు.సబ్ రిజిస్ట్రార్ యుగంధర్, ఆర్ఐ మధుసూదన్, సర్వేయర్ లావణ్య, వీఆర్‌ఓలు రఘునాథ్, నవీన్, సునీల్, రామకృష్ణ, సురేంద్ర, సర్వేయర్ శరవణ పాల్గొన్నారు.

తవణంపల్లె: మండలంలోని గోవిందరెడ్డిపల్లెలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పలువురు రైతులు భూ సమస్యలపై తహసీల్దార్ సుధాకర్ కు అర్జీలు ఇచ్చారు. గోవిందరెడ్డి హరిజనవాడకు శ్మశాన దారి ఆక్రమణలు తొలగించాలని కోరడంతో సుధాకర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించారు. ఆర్ఐ జీవన్‌సాగర్, సర్వేయర్ మురళీకృష్ణ, వీఆర్ఓలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

నేడు మునిసిపల్ కౌన్సిల్ సమావేశం

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు కార్పొరేషన్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు మేయర్ అముద ఒక ప్రకటనలో తెలిపారు. కార్పొరేటర్లతో పాటు కో-ఆప్షన్ సభ్యులు, ఎక్స్-అఫిషియో సభ్యులు హాజరు కావాలని కోరారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి





జోహార్ అంబేడ్కర్ అంటూ నినాదాలు చేస్తున్న గాయత్రీదేవి, నాయకులు, బంగారుపాళెం: అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సునీల్‌కుమార్







నివాళి అర్పిస్తున్న ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్, అరగొండలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దళిత నాయకులు, చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో..

చిత్తూరు కార్పొరేషన్: అంబేడ్కర్ వర్ధంతి పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. జిల్లా పార్టీ మహిళా విభాగం మాజీ అధ్యక్షురాలు గాయత్రీదేవి మీడియాతో మాట్లాడారు. దళిత, గిరిజనులపై జరుగుతున్న దాడుల్ని, అఘాయిత్యాలను ఆపడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. జగనన్న ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాలతో అత్యధికంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలే లబ్ధి పొందారన్నారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లో ఎండగడతామన్నారు. ప్రకాశ్ మాట్లాడారు. నాయకులు, ప్రజాప్రతినిధులు లక్ష్మణస్వామి, కేపీ శ్రీధర్, మధురెడ్డి, సూర్యప్రకాష్, భాగ్యలక్ష్మి, అంజలీరెడ్డి, హరిషా, నౌషాద్, మురళి, శేఖర్, వెంకటేష్, నవీన్ యాదవ్, సెల్వ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో కార్యాలయంలో..

ట్రాన్స్‌కో కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటాలకు ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్, ఈఈ మునిచంద్ర వేర్వేరుగా నివాళి అర్పించారు. అంబేడ్కర్ చూపిన బాటలో ఎందరో జీవితాల్లో వెలుగు వచ్చిందన్నారు. ఈఈలు జగదీష్, సురేష్, డీఈలు ప్రసాద్, ఆనంద్, శేషాద్రి, ఏఈలు సిబ్బంది పాల్గొన్నారు.

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలో శుక్రవారం సీపీఐ, దళితహక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. దర్గా సర్కిల్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు నాగరాజు, దామోదరం, మహేష్, మణి, గోపినాథ్, దాసరి చంద్ర, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి సేవా కార్యక్రమాలు చేపట్టారు. చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు అన్నదానం చేశారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వినాయకం, నాయకులు ఓబులేష్, మురళి, భాస్కర్, ప్రభుకుమార్, కుమార్, నాగరాజు, రమేష్, షణ్ముగం, జయకుమార్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి

చిత్తూరు కలెక్టరేట్: ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు ఐకమత్యంతో ఉంటూ అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వినాయకం అన్నారు. దర్గా సర్కిల్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి ఆ సంఘ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ, రిజర్వుబ్యాంకు, ఫైనాన్స్ కమిషన్ వంటి వ్యవస్థలను ఏర్పాటు చేయాలన్న అంబేడ్కర్ దూరదృష్టి ఎంతో గొప్పదన్నారు. అలాగే సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. అంబేడ్కర్ రాజ్యాంగ రచనతోనే అన్ని వర్గాలకు సమన్యాయం దక్కిందన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం నాయకులు ఓబులేశు, మురళి, భాస్కర్, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

తవణంపల్లె: తవణంపల్లెలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి మండల దళిత యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. మండల దళిత యువజన సేవా సంఘం నాయకులు మురుగన్, జగన్నాథం, షణ్ముగం, పరదేశి, మధుకుమార్, కుమార్, అనంతకుమార్, సుధాకర్, గోవిందన్ పాల్గొన్నారు.

అరగొండలో...

అరగొండ కొత్త బస్టాండులో స్థానిక సర్పంచ్ మల్లుదొరై ఆధ్వర్యంలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి నివాళులర్పించారు. మాజీ సర్పంచ్ జి.కరీం, ప్రశాంతకుమార్, తంగరాజ్, బాబు పాల్గొన్నారు.

రాజ్యాంగ నిర్మాతకు నివాళులు

చిత్తూరు అర్బన్: భారత రాజ్యాంగ నిర్మాత, దేశ తొలి న్యాయశాఖ మంత్రి బీఆర్.అంబేడ్కర్‌కు రాజకీయ నాయకులు, అధికారులు ఘన నివాళులర్పించారు. చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ అముద, కమిషనర్ నరసింహప్రసాద్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. అంటరానితనాన్ని రూపుమాపడం, ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడ్డ తరగతులకు ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించడం అంబేడ్కర్ సాహసోపేత నిర్ణయాలకు నిదర్శమన్నారు. సహాయ కమిషనర్ ప్రసాద్, ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు. అలాగే చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో వర్ధంతి నిర్వహించారు. ఏఎస్ఐ ఉమామహేశ్వర్, శ్రీదేవి, త్యాగరాజులు తదితరులు పాల్గొన్నారు.

మండల జై భీం సేవా సంఘం ఆధ్వర్యంలో..

బంగారుపాళెంలో జై భీం సేవాసంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. అనంతరం స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు.

దళితజాతి మణికిరీటం అంబేడ్కర్

బంగారుపాళెం: దళితజాతి మణి కిరీటం డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ అని ఎమ్మెల్యే మురళీమోహన్ పేర్కొన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దళితజాతిలో పుట్టి దేశం గర్వించ దగ్గ గొప్ప నాయకుడిగా అంబేడ్కర్ చరిత్ర కెక్కారన్నారు. దళితుల విద్యాభివృద్ధికి పాటుపడిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు జయప్రకాష్, జనార్దన్‌గౌడ్, జయచంద్రనాయుడు పాల్గొన్నారు.



కార్పొరేషన్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న మేయర్, కమిషనర్, ఉద్యోగులు



బంగారుపాళెం: అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

బడుగుల దార్శనికుడు అంబేడ్కర్

బంగారుపాళెం: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పాటు పడిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ గొప్ప దార్శనికుడని వైఎస్సార్‌సీపీ పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. బంగారుపాళెంలో అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ, దళిత నాయకులు నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, విద్యతోనే దళితజాతికి వెలుగని చాటి చెప్పిన మహనీయుడని కొనియాడారు. జడ్పీమాజీ చైర్మన్ కుమార్‌రాజా మాట్లాడుతూ.. రాజ్యాంగ నిర్మాతగా ప్రపంచంలో పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్న మహనీయుడు అంబేడ్కర్ అన్నారు. జెడ్పీటీసీ సోమశేఖర్ , మండల విప్ హేమచంద్ర, ఎస్సీసెల్ అధ్యక్షుడు నాగరాజ, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కిషోర్‌కుమమార్‌రెడ్డి, మండల యాత్ అధ్యక్షుడు జగదీష్, దళితనాయకులు విజయకుమార్, నాగేంద్ర, శైలేష్, గజేంద్ర, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు వానర నివాళి!



అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉన్న వానరాలు

బంగారుపాళెం: అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి శుక్రవారం నాయకులు పూలదండలు వేసి నివాళులు అర్పించారు. సమీపంలోని చెట్టు కొమ్మలపై కూర్చున రెండు చిన్న వానరాలు వింతగా చూశాయి. నాయకులు అందరూ వెళ్లిన తరువాత చెట్టు కొమ్మలను దిగి అంబేడ్కర్ విగ్రహం వద్దకు వచ్చాయి. నీకు మా నివాళి అన్నట్టు ఓ వానరం విగ్రహం భుజంపై కూర్చుని పూలమాలను తదేకంగా పరిశీలించింది. మరో వానరం విగ్రహం అక్కడే ఇనుప కమ్మీలపై కూర్చుంది.

